

శ్రీవిద్యాసరస్వతి క్షేత్రానికి 'భోగ్' సర్టిఫికెట్

వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రానికి భోగ్ సర్టిఫికెట్ వచ్చింది. 2025 మార్చి 27 వరకు ఈ గుర్తింపు ఉంటుంది. 8లో..




తల ఒక చోట.. మొండెం మరోచోట

భూవివాదంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన ఝరాసంగం మండలం బర్దీపూర్‌లో చోటు చేసుకుంది. 8లో..

మూడు లక్షల మందికి నేత్ర పరీక్షలు

సిద్దిపేటకమాన్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 3లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. 47 వైద్య బృందాలతో 3,01,055 మందికి పరీక్షలు నిర్వహించి, 60,469 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, మరో 48,947 మందికి అద్దాలను ఆర్డర్ చేశామని తెలిపారు.



న్యూస్‌రీల్

మంత్రి సమక్షంలో చేరికలు



పార్టీలో చేరిన వారితో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలోని వెంకటాపూర్ గ్రామ బీజేపీ యువకులు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వెంకటేష్, లింగం, హరికృష్ణ, పవన్, శివ తదితరులు ఉన్నారు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.23,20,210

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 96 రోజుల్లో భక్తులు వేసిన కానుల ద్వారా రూ.23,20,210 ఆదాయం సమకూరినట్లు ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్, ఆలయ కార్యనిర్వహణాధికారి కట్టా సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. రాధికా, అన్నపూర్ణ, సత్యసాయి, ఆనంద్ సేవాసమితిల సభ్యులు, భక్తులు లెక్కింపులో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గౌరారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, డీఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ పాఠశాల బాలికల వసతి గృహంలో మెస్‌ను డీఈఓ శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమసమాజ స్థాపనకు విద్య ఎంతో అవసరమని, శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, నాయకులు రాధాకృష్ణశర్మ, సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ జ్యోతి, హెచ్ఎం పద్మలత, స్పెషల్ ఆఫీసర్ శారద, వార్డెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు రామంచలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

మీర్జాపూర్ పీహెచ్‌సీ తనిఖీ

హుస్నాబాద్‌రూరల్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం అనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణపై డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సామ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో సర్పంచ్ తరాల లత, వైద్య సిబ్బంది ఉన్నారు.

మార్కెటింగ్ శాఖ బడ్జెట్ సమావేశం

గజ్వేల్: ఉమ్మడి మెదక్ జిల్లాలోని 29 మార్కెట్ కమిటీల బడ్జెట్ ఆమోదం కోసం మంగళవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ శాఖ అదనపు డైరెక్టర్ రవికుమార్, ఆర్‌జేడీ ఇష్తకర్ అహ్మద్, జేడీఎంలు శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్ అహ్మద్ హాజరయ్యారు. ఆయా మార్కెట్ కమిటీల కార్యదర్శులు తీసుకువచ్చిన బడ్జెట్ పత్రాలను పరిశీలించి ఆమోదం తెలిపారు. అనంతరం మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులను మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీల కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల బ్యాంక్

- సిద్దిపేట జీజీహెచ్‌కు మంజూరు
- సేకరించిన పాలు ప్రత్యేక గదిలో నిల్వ
- రూ.34 లక్షల వ్యయంతో ఏర్పాటు



సిద్దిపేట జీజీహెచ్

సాక్షి, సిద్దిపేట: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప.. అంతకంటే గొప్పది తల్లిపాల దానం. తల్లి పాల దానంతో చిన్నారులకు ప్రాణ, ఆరోగ్య భిక్ష పెట్టవచ్చు. వివిధ కారణాలతో పాలు అందని నవ జాత శిశువులకు తల్లి పాలను అందించేందుకు ఈ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అమ్మ పాలను సేకరించి నిల్వ చేసేందుకు సిద్దిపేట జీజీహెచ్‌ను ఎంపిక చేశారు. మంత్రి హరీశ్ రావు చొరవతో జిల్లాలోని ప్రభుత్వ బోధన ఆస్పత్రికి(జీజీహెచ్) మదర్ మిల్క్ బ్యాంక్ మంజూరైంది. త్వరలో అందుబాటులోకి రానున్నడంతో తల్లి పాలు లేని నవ జాత శిశువుల ఇక్కట్లు తీరనున్నాయి.

సంపూర్ణ ఆరోగ్యానికి

- తల్లి పాలతో బిడ్డ ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయి. శిశువులలో అతిసార వ్యాధి, న్యుమోనియా రాకుండా నివారించవచ్చు. తద్వారా శిశు మరణాల సంఖ్య తగ్గుతుంది.
- తల్లిపాలు తాగిన పిల్లల్లో ఊబకాయం, మధుమేహ వ్యాధులు తక్కువగా కనిపిస్తాయి.
- పోషకాలు ఉండే తల్లిపాలకు నవజాత శిశువులు దూరం కావొద్దనే ఉదేశ్యంతో సిద్దిపేట జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నారు.
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూ.34లక్షలతో మదర్ మిల్క్ బ్యాంక్‌కు శ్రీకారం చుట్టారు.
- జీజీహెచ్‌లో ప్రత్యేక గదిని కేటాయించి పాలను నిల్వ చేయనున్నారు.
- బిడ్డకు ఇవ్వగా మిగులు పాలను సేకరించి వీటిని నిల్వ చేస్తారు. పాలు దానం చేయాలనుకునే దాతలు జీజీహెచ్ మిల్క్ బ్యాంక్‌కు వచ్చి ఇవ్వొచ్చు.

ఏడాది పాటు నిల్వ

- హెచ్ఐవీ, వీడీఆర్ఎల్ (వెనెరియల్ డిసీజ్ రీసెర్చ్ లేబొరేటరీ టెస్ట్), హెపటైటిస్ పరీక్షల్లో నెగిటివ్ వస్తేనే తల్లి పాలు తీసుకుంటారు.
- సేకరించిన తల్లి పాలను ఫ్రీజర్‌లలో స్టోర్ చేస్తారు. రెండేళ్ల బిడ్డ వరకు అవసరం ఉన్న వారికి స్టోర్ నుంచి పాలను అందిస్తారు.
- కనీసం 6 నెలల నుంచి గరిష్టంగా ఏడాది పాటు పాలు పాడవకుండా భద్రపరుస్తారు. ఇందుకు ప్రత్యేక యంత్రాలు జీజీహెచ్‌లో ఏర్పాటు చేయనున్నారు.
- ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జీజీహెచ్‌లో 389 డెలివరీలు కాగా అందులో తక్కువ బరువుతో, తక్కువ నెలలకు పుట్టిన వారు సుమారుగా 20శాతం ఉంటున్నారు.
- వీరికి ఎస్ఎన్‌సీయూలో(నవజాత శిశు సంరక్షణ కేంద్రం) చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి వారికి, పాలు రానీ తల్లులుంటే వారి పిల్లలకు మదర్ మిల్క్ బ్యాంక్ పాలను అందించనున్నారు.

ప్రత్యేక గదిని కేటాయిస్తాం



నవ జాత శిశువులకు తల్లిపాలు అందించే ఉద్దేశ్యంతో మంత్రి హరీశ్ జీజీహెచ్‌కు మదర్ మిల్క్ బ్యాంక్‌ను కేటాయించారు. దీని కోసం ఆస్పత్రిలో ప్రత్యేక గదిని కేటాయిస్తాం. త్వరలో అందుబాటులోకి తెచ్చి నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తాం.

– కిశోర్, సూపరింటెండెంట్, జీజీహెచ్

తెలంగాణ అభివృద్ధి దేశమంతా జరగాలి



కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశమంతా జరగాలనీ జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. కొమురవెల్లి పాత కమాన్ నుంచి మల్లన్న ఆలయం వరకు రూ.10.32కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, 38మందికి డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం పాల్గొని మాట్లాడారు. పారే నది నీటిని 517 మీటర్ల ఎత్తులో మల్లన్న సాగర్‌కు తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అధిక మెజార్టీతో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, సర్పంచ్‌లు సార్ల లత, బోడుగాం పద్మ, సద్ది కృష్ణారెడ్డి, స్వామి, మండల నాయకులు కిషన్, సార్ల కిష్టయ్య, కృష్ణారెడ్డి, నర్ర రఘువీరరెడ్డి పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

మద్దూరు(హుస్నాబాద్): రానున్న రోజుల్లో ఎర్రకోటపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లద్నూరులో పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, సర్పంచ్ జీడికంటి సుదర్శన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, కనుకరాజు, నాయకులు శ్రీనివాస్‌చారి, రాజు, రవిరాజు, బాలు, ప్రభాకర్, సోమ్మయ్య, నందు, పాల్గొన్నారు.

టీచర్ల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష పేపర్ల వాల్యుయేషన్ కోసం ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్‌టీఏ నాయకులు మాట్లాడుతూ మూల్యాంకనం కోసం సీనియార్టీ ప్రాతిపదికన ఎంపిక చేయలని, ప్రతీ పాఠశాల నుంచి 50శాతం మించకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. నాన్ స్పౌస్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.పద్మారెడ్డి, పి.రవీందర్ రెడ్డి, జిల్లా ప్రతినిధులు రామస్వామి, సిద్దేశ్వర్, జనార్దన్ రెడ్డి, సురేష్ కుమార్, దేవరుషి, భిక్షపతి, భాస్కర్, శివరాజం, రామస్వామి, వెంకటేశం పాల్గొన్నారు.



డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ బాబు నాయక్

దుబ్బాక: నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ హెచ్చరించారు. మంగళవారం రాయపోల్ మండల రైతు వేదికలో ఫర్టిలైజర్ డీలర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. అధికారులు ధృవీకరించిన విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్మాలని సూచించారు. నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదు చేసి, దుకాణాలు సీజ్ చేస్తామని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువుల బిల్లులపై సంతకాలు చేయాలని, షాప్‌లో నిల్వ సమాచారాన్ని స్టాక్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఓ నాగరాజు, ఏఈఓ ప్రశాంత్, తదితరులున్నారు.

మనిషి ఎదుగుదలకు జ్ఞానం అవసరం



మాట్లాడుతున్న రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల

సిద్దిపేటకమాన్: మనిషి ఎదుగుదలకు జ్ఞానం అవసరమని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ నిర్మల అన్నారు. ప్రోగ్రెసివ్ పేరెంట్ లీగ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ రెండో శనివారం గురుకులాల్లో తల్లిదండ్రుల సమావేశం ఉంటుందని, పిల్లల స్థితిగతులపై చర్చించాలని సూచించారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో జిల్లాకు బీఎస్సీ అగ్రికల్చర్ గురుకుల కళాశాల మంజూరైందని, ప్రోగ్రెసివ్ పేరెంట్స్ లీగ్ ఆధ్వర్యంలో గురుకులాల బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీపీఎల్ రాష్ట్ర కోకన్వీనర్ సదానందం, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి, ప్రతినిధులు భాగ్యలక్ష్మి, మధు, రామాంజనేయులు, జనార్దన్, సంజీవ్, భూపాల్, బాబురావు, సురేష్, బాబు, లావణ్య, రాజమల్లవ్వ, రూప తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ శ్వేత, అధికారులు

పెండింగ్ కేసులు త్వరగా ఛేదించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ అంజనీకుమార్

సిద్దిపేటకమాన్: పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని డీజీపీ అంజనీకుమార్ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచడంపై సీపీ శ్వేత, పోలీసు సిబ్బందిని అభినందించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా సబ్ డివిజన్, సర్కిల్, పోలీసు స్టేషన్ల పరిధిలో శోభాయాత్రల రూట్ మ్యాప్‌ను తయారు చేసుకోవాలని, ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏసీపీలు దేవారెడ్డి, రమేష్, సతీష్, సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెరిగేలా బోధించాలి

అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

హుస్నాబాద్: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ట్రెనీ కలెక్టర్ ఫైజల్ అహ్మద్, నోడల్ అధికారులు, క్లస్టర్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజన్ అధికారులకు సూచించారు. విద్యార్థుల కనీస సామర్థ్యం పెంచేలా చూడాలన్నారు. చదవడం, రాయడం, గణితంలో మెళకువలను నేర్పించాలన్నారు. టీచింగ్, లర్నింగ్ మెటీరియల్‌తో అందరికీ అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి విద్యార్థులు ఆడియో పాఠాలు వినేలా, ప్రతీ రోజు డైరీ రాసేలా అవగాహన కల్పించాలన్నారు. మండల అధికారులు నెలలో రెండుసార్లు పాఠశాలలను సందర్శించి, పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, ఎంఈఓలు దేశిరెడ్డి, నర్సింహరెడ్డి, పావని, బండారి మనీల, సీఆర్పీలు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యాస మహర్షి యోగా కేంద్రంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బహుముఖ వికాసానికి యోగా అవసరమని అన్నారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ జిల్లా అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, సిద్దిపేట స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, శిక్షకులు తోట సతీష్, సంధ్య, యోగా సభ్యులు రాజమల్లు, లింగమూర్తి, బస్వరాజ్ కుమార్, సాయి, కవిత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ జరిపించాలి



ఏబీవీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

సిద్దిపేటజోన్: టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సీబీఐతో విచారణ చేయాలని ఏబీవీపీ ఉమ్మడి జిల్లా విభాగ్ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా సీఐ భిక్షపతి ముట్టడికి యత్నించిన నాయకులను అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ ఘటన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కార్యదర్శి అనిత రామచంద్రన్‌ను విచారించాలన్నారు. నిరసనలో వివేక్, శశి, ఆకాష్, ఆదిత్య, సంజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమాలకు చెక్

- జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం
- క్రమంగా ఇనాక్టివ్ కూలీల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా వివరాలు

జాబ్‌కార్డులు	-	2,01,841
మొత్తం కూలీలు	-	4,07,689
యాక్టివ్ కార్డులు	-	1,36,263
ఇనాక్టివ్ కార్డులు	-	65,578
యాక్టివ్ కూలీలు	-	2,36,561
ఇనాక్టివ్ కూలీలు	-	1,71,128



రాఘవాపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సిద్దిపేటరూరల్: ఉపాధిహామీని పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం రకరకాల మార్పులు చేస్తోంది. గ్రామాల్లో అర్హులైన కూలీలకు ప్రతీ రోజు పని కల్పించేందుకు వారి జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. జాబ్‌కార్డు ఉండి పనికి వెళ్లకుండా ఉండేవారిని ఇనాక్టివ్‌గా గుర్తించి క్రమంగా జాబితా నుంచి తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఇంత కాలం పనికి వెళ్లకుండా కూలి డబ్బులు పొందుతున్న వారికి చెక్ పడనుంది.

అనుసంధానం తప్పనిసరి..

- ఇటీవల నూతన సిస్టం ద్వారా పరిమితితో కూడిన పనులు, హాజరు నమోదునకు మొబైల్ మానిటరింగ్, డబ్బు చెల్లింపులోనూ నూతన విధానం ప్రవేశపెట్టింది.
- జిల్లాలో రోజువారిగా 2,36,561 మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరిలో 2,33,815 మంది జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం పూర్తయింది.
- ఆధార్‌లో పొరపాట్లు ఉన్నవారు కూడా అనుసంధానం చేసుకుంటే వంద శాతం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.
- కూలీల జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేసి, పనులు చేసిన వారికి మాత్రమే డబ్బులను అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- ఉపాధి హామీ కూలీలకు ప్రస్తుతం పోస్టల్, బ్యాంకుల ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు.

ఆందోళన వద్దు



జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న కూలీలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటికే వారందరికీ ఆధార్ అనుసంధానం పూర్తయింది. అర్హులైన కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇనాక్టివ్ కూలీలు, జాబ్ కార్డు వివరాల నమోదులో సమస్యలతో కొన్ని తిరస్కరణకు గురవుతున్నాయి. ఆధార్ లింక్ చేసిన వారి ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతాయి.

– చంద్రమోహన్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ, సిద్దిపేట

క్లుప్తంగా

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమంగా కొనసాగుతున్న గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 145 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

పేలిన ట్రాలీఆటో టైరు

ఒకరికి తీవ్రగాయాలు



మహేశ్ కు చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

పటాన్‌చెరు టౌన్: ట్రాలీఆటో టైరుపేలిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం పటాన్‌చెరు నుంచి స్క్రాప్‌బ్యాటరీ లోడ్‌ను చాదర్‌ఘాట్‌కు తీసుకెళుతుండగా, పాటి గ్రామశివారు ఓఆర్ఆర్ సమీపంలోకి రాగానే టైరుపేలి ఆటో బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ మహేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన బైరి ఐలయ్య మంగళవారం తన కాడెద్దులను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

రోడ్డు దాటుతుండగా..



పునుగు పిల్లి కళేబరం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలో ఖాజీపల్లి అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా పునుగుపల్లి మృతి చెందింది. మంగళవారం ఉదయం రోడ్డుపై పునుగు పిల్లి కళేబరం పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సమీప అటవీప్రాంతంలో వీటి సంచారం ఎక్కువగా ఉందన్నారు.


శ్రీవిద్యాసరస్వతి క్షేత్రానికి 'భోగ్' సర్టిఫికెట్

ఫుడ్‌సేఫ్టీలో జాతీయస్థాయి గుర్తింపు

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రానికి భోగ్ (దేవుడికి సమర్పించే పరిశుభ్రమైన నైవేద్యం) సర్టిఫికెట్ వచ్చింది. ఈ సర్టిఫికెట్ గుర్తింపు 2023 మార్చి 28 నుంచి 2025 మార్చి 27 వరకు ఉంటుంది. శుచి, శుభ్రతకు మారుపేరుగా నిలిచిన వర్గల్ ఆలయం 'భోగ్' గుర్తింపు పొందిన అతి తక్కువ దేవాలయాల్లో ఒకటిగా నిలిచింది. మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశాలతో రాష్ట్ర ఆహార భద్రత అధికారులు వర్గల్ శ్రీవిద్యాసరస్వతి ఆలయంతోపాటు రాష్ట్రంలోని మరో 5 దేవాలయాల వివరాలను జాతీయస్థాయి 'భోగ్' సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత పలుమార్లు కేంద్రం నుంచి ప్రత్యేక ఆడిట్ బృందం శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రాన్ని సందర్శించింది. నైవేద్యం, అన్నప్రసాదాల నాణ్యత, కిచెన్ నిర్వహణ, ఆహారం తయారు చేసే విధానం, శుచి, శుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఫుడ్‌సేఫ్టీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందని వారు నిర్ధారించుకుని 'భోగ్' గుర్తింపుకు వర్గల్ క్షేత్రాన్ని రిఫర్ చేశారు.

మంత్రి ఆదేశాలతో 'భోగ్' టార్గెట్‌గా..

మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో భోగ్ సర్టిఫికెట్ టార్గెట్‌గా రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ విభాగం విశేష కృషి జరిపింది. భోగ్ ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారిణి జ్యోతిర్మయి ఆధ్వర్యంలోని బృందం వర్గల్ దేవాలయాన్ని సందర్శించి నైవేద్యం, అన్నప్రసాదాలు తయారీలో అనుసరించాల్సిన నాణ్యత ప్రమాణాలపై, శుభ్రత విషయంలో పాటించాల్సిన పద్ధతులపై ఆలయ నిర్వాహకులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏటా 5 లక్షలమందికి పైగా భక్తులకు నిత్యాన్నదాన మహాప్రసాదం అందజేస్తున్న వర్గల్ క్షేత్రాన్ని కేంద్ర బృందం ఫైనల్ ఆడిట్ జరిపిన అనంతరం జాతీయస్థాయి భోగ్ గుర్తింపు లభించింది.



Sri Vidya Saraswathi Saneschara Temple
WARGAL SIDDIPET, TELANGANA
is certified as
Eat Right
PLACE OF WORSHIP
as per benchmarks established by
Food Safety and Standards Authority of India
for the period of 28th march, 2023 to 27th March, 2025

'భోగ్' గుర్తింపు పత్రం



వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రం

హర్షం వ్యక్తం చేసిన మంత్రి హరీశ్‌రావు

వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రానికి భోగ్ గుర్తింపు లభించడం సంతోషించదగ్గ విషయమని మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి సంతోషం వ్యక్తం చేశారు. ఆలయం తరపున మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తల ఒక చోట... మొండెం మరోచోట

భూతగాదాలతో దారుణ హత్య

ఝరాసంగం(జహీరాబాద్): భూవివాదంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం...ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి చెందిన చంద్రయ్య(60) మంగళవారం గ్రామశివారులో పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, తమ్ముడి కుమారుడు రాకేష్ పాతకక్షలు, భూతగాదాలు మనసులోకి ఉంచుకొని తన వద్ద ఉన్న కత్తితో నరికి చంపేశాడు. అంతటితో ఆగకుండా తలను గ్రామంలోకి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి ఝరాసంగం గ్రామ శివారులోని ఓ పెట్రోల్ పంపు వద్ద పడేశాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వెంకటేశం, ఎస్‌ఐలు రాచేందర్‌రెడ్డి, వినయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు వినియోగించిన కత్తిని సంఘటనస్థలం నుంచి స్వాధీనం చేసుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. మృతుడికి కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హత్య చేసిన వ్యక్తి అదుపులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. తలను తీసుకుని గ్రామంలోకి రావటంతో గ్రామస్తులు తీవ్ర భయందోళనకు గురయ్యారు.



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ముర్రుపాలు అమృతంతో సమానం

గజ్వేల్‌రూరల్: పుట్టిన బిడ్డకు గంటలోపు పట్టించే ముర్రుపాలు అమృతంతో సమానమని బీఎఫ్‌హెచ్‌ఐ (బేబీ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇన్సియేటివ్) డాక్టర్ వినోద ఉన్నమ్ అన్నారు. బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా(బీపీఎన్‌ఐ) ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బందికి తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టిస్తే కలిగే ఉపయోగాలు, పాలు పట్టించే విధానం అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆస్పత్రిలో ఐఎంఎస్ చట్టం అమలు, చిన్నారులకు పాలు పట్టించే విధానం, బాలింతలకు అందిస్తున్న కౌన్సిలింగ్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ రాము, గైనకాలజిస్ట్ డాక్టర్ మంజుల, డాక్టర్ శాంతన్‌రెడ్డి, డాక్టర్ జ్యోతి, నర్సింగ్ సూపరింటెండెంట్ శాంతకుమారి పాల్గొన్నారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న డాక్టర్ వినోద ఉన్నమ్

జ్యూస్ సెంటర్ సీజ్

మిరుదొడ్డి(దుబ్బాక): పలువురి అస్వస్థతకు కారణమైన ఓ జ్యూస్ సెంటర్ అధికారులు సీజ్ చేశారు. మిరుదొడ్డిలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జ్యూస్ పాయింట్ పేరుతో నరేష్ పలురకాల జ్యూస్‌లు తయారు చేసి విక్రయిస్తున్నాడు. రెండు రోజుల క్రితం జ్యూస్ పాయింట్‌లో వివిధ రకాల జ్యూస్‌లు తాగిన 30 మంది తీవ్రఅస్వస్థతకు లోనయ్యారు. వారంతా మిరుదొడ్డి, దుబ్బాక, సిద్దిపేటలో చికిత్స పొందారు. జ్యూస్ విక్రయిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొందరు బాధితులు అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ జహరొద్దీన్, గ్రామ సర్పంచ్ రంగనబోయిన రాములు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పహీంలు జ్యూస్ పాయింట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే జ్యూస్ నిర్వాహకుడు పారిపోయాడు. దీంతో అధికారులు ఆ జ్యూస్ సెంటర్‌ను సీజ్ చేశారు.



చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంగారెడ్డి టౌన్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పోషణ్ అభియాన్ శిక్ష సమన్వయకర్త సౌమ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని పాత డీఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా సమాఖ్య సమావేశంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యం, పెరటి తోటల పెంపకం, పిల్లల పెరుగుదల, పోషకాహారం, ఆహార వైవిధ్యం, పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. ప్రతి మండల, గ్రామ మీటింగ్‌లలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, సాగు గురించి వివరించాలన్నారు. అనంతరం పోషణ పక్షం పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, పోషణ అభియాన్ శిక్ష కోఆర్డినేటర్ సౌమ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నచొప్ప లోడ్‌తో వెళుతుండగా...



జహీరాబాద్: జొన్నచొప్ప లోడ్‌తో వెళుతున్న డీసీఎంకు మంటలు అంటుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మల్‌చల్మ గ్రామానికి చెందిన డీసీఎం యజమాని ఖలీద్ పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన నసీర్ వద్ద మంగళవారం సాయంత్రం జొన్నచొప్ప కొనుగోలు చేశాడు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ శివారు నుంచి చొప్ప లోడ్‌తో వెళుతున్న డీసీఎంకు విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో పరిసరాల్లో ఉన్న కాలనీవాసులు నీరు పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40వేల విలువగల చొప్ప దగ్ధమైంది.

ఎమ్‌టీ కోక్ తగిలి కానిస్టేబుల్‌కు గాయాలు

- ఏకే–47 శుభ్రపరుస్తుండగా ఘటన
- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స.. ఆపై హైదరాబాద్‌కు తరలింపు

సిద్దిపేటకమాన్: గన్ శుభ్రం చేస్తుండగా లోపల ఉన్న ఎమ్‌టీ కోక్ తగిలి ఓ ఏఆర్ కానిస్టేబుల్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన ఎస్. రాజశేఖర్ సిద్దిపేట సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సాయుధ దళాల వార్షిక పునశ్చరణలో భాగంగా రాజగోపాల్‌పేటలో పోలీస్ ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించి, అనంతరం ఆయుధాలను సీఏఆర్ హెడ్ క్వార్టర్‌కు తరలించారు. విధుల్లో ఉన్న రాజశేఖర్ మంగళవారం ఏకే 47 తుపాకీని శుభ్రం చేస్తుండగా లోపల ఇరుక్కుపోయిన ఎమ్‌టీ కోక్ ఒత్తిడికి గురై బలంగా వెనక్కి రావడంతో కుడి కన్ను, భుజానికి తగిలింది. ఘటనలో గాయపడిన రాజశేఖర్‌ను పోలీసు సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ సరోజినీదేవి కంటి ఆస్పత్రికి తరలించారు. రాజశేఖర్‌కు అందుతున్న వైద్య సేవలపై సీపీ శ్వేత ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యాధికారులకు సూచించారు.



సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రాజశేఖర్

విద్యార్థి అదృశ్యం



ఇబ్రహీం(ఫైల్)

కంది(సంగారెడ్డి): పాఠశాల నుంచి విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..కందిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో కోహిర్ మండలం కవేలి గ్రామానికి చెందిన మహమ్మద్ సొద్ ఇబ్రహీం పదోతరగతి చదువుతున్నాడు. ఈనెల 27వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. ఇబ్రహీం కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ప్రిన్సిపాల్ ఉషశ్రీ మంగవాళం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

కొండపాక(గజ్వేల్): పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో పార్ల జయరాములుకు మూడేళ్ల జైలు, రూ. 3వేలు జరిమానా విధిస్తూ మంగళవారం సిద్దిపేట జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి భవాని తీర్పు చెప్పారని కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గిరాయిపల్లికి చెందిన పార్ల జయరాములు ప్రేమపేరుతో ఓ మైనర్ వెంటపడడంతో 2019లో కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్‌ఐ పరమేశ్వర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

ఒకదాని వెనుక మరోటి

లారీ, బస్సు, కారు ఢీ..తప్పిన ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): హైదరాబాద్ వైపు వెళుతున్న లారీని ఎక్స్‌ప్రెస్ బస్సు, కారు ఒకదానికి ఒకటి ఢీకొన్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి ప్రయాణికులతో గరుడా ఎక్స్‌ప్రెస్ బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో మండలపరిధిలోని కాళ్ళకల్ గ్రామ శివారులోకి రాగానే జాతీయ రహదారిపై స్టీల్ లోడ్‌తో వెళుతున్న లారీ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో వెనుక వస్తున్న బస్సు దానిని ఢీకొట్టింది. అదే వరుసలో ఉన్న కారు సైతం బస్సును ఢీ కొట్టింది. పలువురికి చిన్న చిన్న గాయాలయ్యాయి. ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

వైద్యం కోసం వెళితే...



తీవ్రంగా గాయపడిన నరేశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): అనారోగ్యంతో చికిత్సకు వెళ్లిన ఓ యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఎస్‌ఐ మధుసూధన్‌గౌడ్, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌గౌడ్ వైద్యం కోసం సోమవారం రాత్రి వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రి నిర్వాహకుడైన ఆర్ఎంపీ సకాలంలో స్పందించలేదు సరికదా అతని కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన యువకుడిపై కర్రతో దాడిచేశాడు. దీంతో నరేశ్ తలపై తీవ్రగాయాలై రక్తంతో దుస్తులు పూర్తిగా తడిసిముద్దయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అతడు కోమాలోకి వెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అదృశ్యమై.. ఆపై శవమై

పాపన్నపేట(మెదక్): ఐదురోజుల క్రితం అదృశ్యమైన ఓ యువకుడు శవమై కనిపించాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..మండల పరిధిలోని దుమ్లాతండాకు చెందిన ధరావత్ శ్రీకాంత్(24) ఈనెల 23వతేదీన అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు వెతికినా, ఆచూకీ లభ్యం కాలేదు. తమ్మాయిపల్లి శివారులో శవమై కనిపించాడు. అయితే ఫిట్స్‌తో చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు నడుపుతుండగా.. డ్రైవర్‌కు గుండెనొప్పి



పటాన్‌చెరు ఆస్పత్రిలో మొయినుద్దీన్

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు నడుపుతుండగా, డ్రైవర్‌కు గుండెలో నొప్పిగా అనిపించింది. వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను పటాన్‌చెరు బస్టాండ్‌లో దింపాడు. ఆపై కండక్టర్ సాయంతో ఆస్పత్రికి వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేటకు చెందిన మొయినుద్దీన్ రాణిగంజ్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాణిగంజ్ టు పటాన్‌చెరు బస్సు నడుపుతున్నాడు. మంగళవారం కూడా డ్యూటీలో భాగంగా డిపో నుంచి బయలుదేరాడు. బస్సు ఆర్‌సీపురం వద్దకు రాగానే మొయినుద్దీన్‌కు గుండె నొప్పి ప్రారంభమైంది. వెంటనే అప్రమత్తమై పటాన్‌చెరు బస్టాండ్ వరకు ప్రయాణికులను సురక్షితంగా తీసుకొచ్చాడు. అనంతరం కండక్టర్‌కు చెప్పగా, చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. విషయం ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అక్కడ నుంచి తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

అల్లరి చేసిన యువకులకు కౌన్సెలింగ్

నర్సాపూర్: ఓ ప్రైవేటు కాలేజీ బస్సును ఫాలో చేస్తూ విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్న యువకులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ మంగళవారం ముగియడంతో సంగారెడ్డి నుంచి ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థినులు బస్సులో నర్సాపూర్‌కు వస్తున్నారు. ఈ సమయంలో శివ్వంపేటతండాకు చెందిన ఇద్దరు యువకులు, తునికికి చెందిన మరో యువకుడు బైక్‌పై బస్సును వెంబడించారు. విద్యార్థినులను చూస్తూ అల్లరిగా కేకలు వేశారు. ఇబ్బంది పడిన ఆ విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. నర్సాపూర్ మార్గంలోని ఓ కిరాణ దుకాణం వద్దకు కాలేజీ బస్సును నిలపగా, తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. బస్సు వెనకే వస్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా, బస్సు సిబ్బంది ఫిర్యాదు చేశారని, యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపాలని కోరారన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో ఆ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చామని ఎస్‌ఐ చెప్పారు.

పాఠశాలలో చోరీకి యత్నం

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం ప్రాథమిక పాఠశాలలో చోరీకి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం ఉదయం పాఠశాల తెరిచేందుకు ఉపాధ్యాయులు వెళ్లగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇటీవల పాఠశాలకు మన ఊరు –మనబడి కింద విలువైన వస్తువులు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే చోరీకి యత్నించినట్టు అనుమానిస్తున్నారు. ఈ విషయమై కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోతున్న పూరిగుడిసె

చేగుంట(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఎర్రస్వామి మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నంవేళ ఆయన నివసిస్తున్న పూరిగుడిసెకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చేలోపే గుడిసెలో దాచిన నగదు, బంగారం, సర్టిఫికెట్లు దుస్తులు కాలిపోయాయి. రెవెన్యూ అధికారులు సంఘటనస్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

నర్సాపూర్ రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైరును దొంగిలించారు. రైతులు చెప్పిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని కాజీపేటలో చంద్రమ్మ పొలం వద్ద 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీని పరిధిలో 15 వ్యవసాయ బోరుమోటార్లు నడుస్తున్నాయి. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, అందులోని కాపర్ ఎత్తుకెళ్లారు. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోయారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఉపాధి హామీ పనికెళ్లి...

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధిహామీలో భాగంగా కూలి పనికి వెళ్లిన ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. రోజుమాదిరిగానే మంగళవారం బెజ్జంకి శివారులోని పాపన్నపల్లెలో ఉపాధిపనికి తట్ట, పార తీసుకుని రావుల లచ్చవ్వ (55) వెళుతుండగా, ఒక్కసారిగా కళ్లు తిరిగి కింద పడింది. వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, లచ్చవ్వ అప్పటికే మృతి చెందింది. మృతురాలి కుమారుడు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ కొంరయ్య తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏపీడీ ఓబులేష్, ఎంపీడీఓ రాములు పరిశీలించారు. అక్కడే ఉన్న కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



రావుల లచ్చమ్మ (ఫైల్)

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బావిలో యువకుడి మృతదేహం

పెద్ద శంకరంపేట(మెదక్): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బావిలో లభ్యమైంది. పెద్ద శంకరంపేట ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేట శివారు రేగోడు వెళ్లే దారిలో పాట్లోళ్ల బాయిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం ఉందని మంగళవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. వారు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉంటుందని, వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి టౌన్: రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సంగారెడ్డి రూరల్ పోలీసుల కథనం ప్రకారం..మంగళవారం ఉదయం సంగారెడ్డి పెప్సీ ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియనివ్యక్తిని ఓ వాహనం ఢీకొనగా బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, ఎరుపురంగు బనియన్, నలుపురంగు పాయింట్ ధరించాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చ్యురీలో భద్రపరిచామని, వివరాలు తెలిస్తే...8712656719, 8712656746, 8919785080 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వివాహితపై కత్తితో దాడి

రామాయంపేట(మెదక్): వివాహితపై ఓ యువకుడు కత్తితో దాడి చేశాడు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ప్రగతిధర్మారం గ్రామానికి చెందిన చౌకి స్రవంతి మంగళవారం తన ఇంట్లో పడుకొని ఉండగా, అదే గ్రామానికి చెందిన యువకుడు ఆమెపై దాడిచేసి కత్తితో ఇష్టమొచ్చినట్టు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమె అరుపులతో సదరు యువకుడు పారిపోయాడు. గాయపడిన స్రవంతిని చికిత్స నిమిత్తం 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రసుత్తం ఆమె పరిస్థితి విషమంగానే ఉంది. పరారీలో ఉన్న యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన స్రవంతి

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుల్లో ఒకరికి జైలు, కొందరికి జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై నాలుగు రోజుల క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి రూ.26వేల జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించారు.